## రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి రేపు ఇంటర్వ్యూ

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 2: తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తులను కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మంగళవారం మరోసారి తెలిపారు. ఆంగ్లంలో 3, పొలిటికల్ సైన్స్‌లో 1, కామర్స్, కంప్యూటర్ సైన్స్‌లో 5 చొప్పున, బీబీఏలో 2, స్టాటిస్టిక్స్‌లో 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు జూలై 3వ తేదీన తారా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 3వ తేదీ 5 గంటలలోగా దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే 4న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9441069020 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

జిన్నారం, జూలై 2: జిన్నారం రెవెన్యూ కార్యాలయాన్ని ఆర్డీవో వసంతకుమారి మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ భిక్షపతితో నాలా కన్వర్షన్, ధరణి దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగానే రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారని తహసీల్దార్ తెలిపారు.

## రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

జహీరాబాద్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

కోహీర్, జూలై 2: పార్లమెంట్ సాక్షిగా యావత్ హిందూ సమాజాన్ని కించపరిచిన రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో విపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల మనోభావాలతో చెలగాటమా అంటూ ప్రశ్నించారు. హిందూవులను కించపరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. ధర్నాలో బీజేపీ ఇన్‌చార్జి జగన్నాథ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్‌పాటిల్, పూల సంతోశ్, వైద్యనాథ్, సుధీర్ బండారీ, నర్సింహులు, కిష్టయ్య, సతీశ్, రామరాజు, నరేశ్, చంద్రశేఖర్, వంశవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడటమే లక్ష్యం

జిన్నారం, జూలై 2: ఖాజీపల్లితోపాటు గడ్డపోతారం, అల్లీనగర్, కిష్టయ్యప ల్లి, గండిగూడెం గ్రామాల్లో కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడటమే జేఏసీ లక్ష్యమని ప్రము ఖ న్యాయవాది, పర్యావరణవేత్త దండే రమాకాంత్ అన్నారు. మంగళవారం ఖాజీపల్లిలో జేఏసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాలుష్యాన్ని అరికట్టడమే లక్ష్యంగా ప్రజలతో కలిసి జేఏసీ ఆధ్వర్యంలో పోరాడతున్నామన్నారు. సమస్యను పరిష్కరించడంతో పాటు గ్రామ అభివృద్ధి కోసం పాటుపడుతామన్నారు. కాలుష్యంపై పోరాటం చేపట్టిన తమపై కొంత మంది మండల, గ్రామ నాయకులు తమ ప్రాణాలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని, సమాజం, దేశం కోసం ప్రాణత్యాగం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామన్నారు.

## అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య

మునిపల్లి, జూలై 2: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించండంతోపాటు ఆటపాటలతో చిన్నారులకు మంచి బోధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంగారెడ్డి డీడబ్ల్యూవో లలితకుమారి అన్నారు. మంగళవారం మునిపల్లి మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి పూర్వ విద్యపై అవగాహన కల్పించారు. సీడీపీవో రేణుకపాటిల్ ఉన్నారు.

## పరిశ్రమ డస్ట్‌తో ఉక్కిరిబిక్కిరి

బొల్లారం, జూలై 2: పరిశ్రమ నుంచి అధిక మొత్తంలో వాతావరణంలోకి వెలువడుతున్న డస్ట్‌తో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొల్లారం పారిశ్రామిక వాడలోని విబాండ్ వాల్యూ ప్యాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నుంచి నిత్యం వెలువడుతున్న డస్ట్ వాతావరణంలో చేరి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ తీరుపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సైలెన్సర్లు మార్చితే కేసులు

- ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి
- ఎస్పీ చెన్నూరి రూపేశ్

కలెక్టరేట్ ఎదుట రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను తొక్కిస్తున్న పోలీసులు

సంగారెడ్డి, జూలై 2: ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్లు మార్చితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పోలీసులు శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణ ట్రాఫిక్ పోలీసులు వారం రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సైలెన్సర్లు మార్చిన 72 వాహనాలను గుర్తించినట్లు తెలిపారు. వాటి నుంచి సైలెన్సర్లను తీసివేయించి రోడు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వాడాలని సూచించారు. సైలెన్సర్లు మార్పు చేసిన మెకానిక్‌లపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తిరిగి మోడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తే వాహనదారుల లైసెన్సు రద్దు చేసి బండిని సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్, పట్టణ, రూరల్ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, అశోక్, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

## ఉద్యోగులకు విరమణ తప్పదు

ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరెడ్డి

ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ట్రాన్స్‌కో ఉద్యోగులు

సంగారెడ్డి, జూలై 2: ఉద్యోగానికి విరమణ తప్పదని ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో స్టోర్ ఇన్‌చార్జి, విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సారా ప్రభాకర్‌గౌడ్ ఉద్యోగ విరమణ పొందారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి గజమాలతో ఘనంగా సన్మానించారు. విద్యుత్‌శాఖలో ప్రభాకర్ గౌడ్ 44 ఏండ్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డైరెక్టర్ రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**జీసీ వెల్ఫేర్ జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం**

జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన మాకం నర్సింలును ఘనంగా సన్మానించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారి జగదీశ్ ఆధ్వర్యంలో వీడ్కోలు పలికారు. టీఎన్‌జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు జావీద్ అలీ, వేల్పూరు రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## యూనిఫామ్స్‌ను త్వరగా అందించాలి

అందోల్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫామ్స్ కుట్టడం త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జోగిపేటలో మహిళా సంఘాలు కుడుతున్న స్కూల్ యూనిఫామ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల దుస్తులు వీలైనంత త్వరగా కుట్టాలన్నారు. అనంతరం అందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, చైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డిలను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కంది, జూలై 2: గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కంది మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. తమ ఐదేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి చేపట్టి కంది మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. సహకరించిన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో వారిని ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. తమ పదవీకాలం ముగుస్తున్నందున గ్రామాల్లోని సమస్యలపై స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## సకాలంలో రైతు భరోసా అందించాలి

రామచంద్రాపురం, జూలై 2: రైతు భరోసాను ప్రభుత్వం సకాలంలో అందించి రైతులకు మేలు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల రైతు వేదికలో రైతు భరోసా పథకంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేవానికి జిల్లా సహకార సంఘం అధికారి ప్రసాద్ హాజరయ్యారు. అనంతరం రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కొందరు రైతులు 20 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని అంటే, మరికొందరు 5 ఎకరాల వరకు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మధు, డైరెక్టర్లు సునీల్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, వ్యవసాయ శాఖ ఏవో శ్రీహరి తదితరులు ఉన్నారు.

## క్వారీల అనుమతులు నిలిపివేయండి

ఆర్డీవో వసంతకుమారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఆర్డీవోకు మాదారం గ్రామస్తుల వినతి

జిన్నారం, జూలై 2: మాదారం గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 210లో ఉన్న క్రషర్, క్వారీలు నిబంధనలు పాటించకుండా ప్రజలను ఇబ్బందులుకు గురి చేస్తున్నాయని గ్రామస్తులు మంగళవారం ఆర్డీవో వసంతకుమారికి ఫిర్యాదు చేశారు. జిన్నారం రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవోను మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి లీజు గడువు ముగిసిన క్వారీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నియమ నిబంధనల ఖాతరు చేయకుండా బ్లాస్టింగులు జరుపుతున్నారని, ఇండ్లన్నీ బీటలు వారాయని పేర్కొన్నారు. క్రషర్ల నుంచి వస్తున్న దుమ్ము రోడ్డును, గ్రామాన్ని కప్పేస్తుందని వాపోయారు. లీజు ముగియడంతో రాక్‌సాండ్, రిలిమిక్స్ కంపెనీలకు మైన్స్ అధికారులు నోటీసులు ఇచ్చినా క్వారీలో తవ్వకాలు ఆపడం లేదని ఆరోపించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరడంతో విచారణ నిమిత్తం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గణేశ్, విజయ్‌గౌడ్, దశరథ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

## ఆస్తి తగాదాలో అన్నహతం

హత్య చేసిన తమ్ముడి కుటుంబ సభ్యులు!

తెలుగు బాబు(ఫైల్)

న్యాల్‌కల్, జూలై 2: ఆస్తి తగదాలో సొంత తమ్ముళ్ల కుటుంబ సభ్యులు కలిసి అన్నను హత్య చేసిన ఘటన న్యాల్‌కల్ మండలంలోని మల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగు జగన్నాథ్, బాబు, వైద్యనాథ్, కంటెప్ప అన్నదమ్ముళ్లు. ఆస్తి విషయంలోఅన్నాతమ్ముళ్ల కుటుంబాల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. పొత్తుల ఉన్న 7.20 ఎకరాల భూమిని సమానంగా పంచుకున్నారు. తల్లి పేరిట ఉన్న ఇంటిని అందరి ఒప్పందంతో రూ.10 లక్షలకు బాబు కొనుగోలు చేశాడు. ఆ ఇంటిని తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలని పలుసార్లు అన్నదమ్ములనూ బాబు కోరినా ఎవరూ పట్టించుకోలేదు. మంగళవారం ఉదయం గ్రామంలోని శరణప్ప హోటల్ వద్ద అన్నాతమ్ముళ్ల కుటుంబ సభ్యులు ఇంటి రిజిస్ట్రేషన్ విషయంలో గొడవపడ్డారు. వారి మధ్య మాటమాటాలు పెరిగిపోవడంతో తమ్ముళ్లు వైద్యనాథ్ కుటుంబ సభ్యులు బాబుపై కట్టెలతో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం బీదర్ పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాబు మృతి చెందాడు. జహీరాబాద్ రూరల్ సీఐ నయీమొద్దీన్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాళం వేసిన మూడు ఇండ్లలో చోరీ

హత్నూర, జూలై 2: తాళం వేసిన మూడు ఇండ్లలో చోరీకి పాల్పడిన ఘటన హత్నూర మండలం పన్యాల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుందని హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపారు. మంగళవారం పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చుట్టాకుల గంగమ్మ, తలారి రుక్కమ్మ, గంటబోయిన వీరమణి ఇండ్లకు తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి దుండగులు మూడు ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం స్థానికులు బాధిత కుటుంబాలకు సమాచారం ఇవ్వడంతో బాధితులు ఇండ్లకు చేరుకొని బోరున విలపించారు. గంటబోయిన వీరమణి ఇంట్లో తులం బంగారంతోపాటు 10 తులాల వెండినగలు, చుట్టాకుల గంగమ్మ ఇంట్లో బంగారం, వెండి నగలు, తలారి రుక్కమ్మ ఇంట్లో బట్టలు, సామగ్రి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంగారెడ్డి నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలు చేకరించింది. జిన్నారం సీఐ సుధీర్ కుమార్ ఆ నమూనాలను పరిశీలించారు. ఒకేసారి మూడు ఇండ్లలో చోరీ జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

**వినాయక్‌నగర్‌లో దొంగల హల్‌చల్**

బొల్లారం, జూలై 2: ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని వినాయక్‌నగర్ కాలనీలో మూడు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో దొంగలు హల్‌చల్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాలనీలో దొంగలు సంచరించినట్లుగా స్థానిక సీసీ పుటేజీలో చిత్రాలు నమోదయ్యాయి. దీంతో కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేశారు. కాలనీలో రాత్రిపూట పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

హద్నూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో యోగా చేస్తున్న చిన్నారులు

# అంగన్‌వాడీల్లో ఆందోళన!

- రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని డిమాండ్
- మండలంలో ముగ్గురు టీచర్లు, 40 మంది ఆయాలు

న్యాల్‌కల్, జూలై 2: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ప్రభుత్వం వయోపరిమితి 65 ఏండ్లకు పరిమితం చేసింది. హఠాత్తుగా కొంతమంది తొలిగింపునకు ఏర్పాట్లు చేస్తుండడంతో పాటు వారికి ఇచ్చే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఖాళీలు ఉన్న పోస్టుల భర్తీ చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వయోపరిమితిని పరిగణలోకి తీసుకుని రిటైర్మెంట్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అయితే గత నెలలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని భావించినా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడింది. ఇప్పటికే సంబంధిత అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏండ్లు నిండిన టీచర్లు, ఆయాల వివరాల సేకరణ పూర్తి చేశామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, రాయికోడ్, మొగుడంపల్లి మండలాల్లో కలిపి 392 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 27,800 మందికిపైగా పిల్లలు ఉన్నారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఆయా మండలాల పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లో 65 ఏండ్లు నిండిన ముగ్గురు టీచర్లు ఉన్నారు. వీరందరూ ఈ నెల, వచ్చే నెలలో రిటైర్ కానున్నారు. టీచర్ల వయోపరిమితి లెక్కింపు ఎలాంటి సమస్య ఎదురు కాలేదు. కానీ, రిటైర్మెంట్ పొందనున్న 40 మంది ఆయాలకు ఎలాంటి విద్యార్హత లేకుండా ఉద్యోగాల్లో నియమించడంతో వయోపరిమితి లెక్కించడంలో సమస్యగా మారింది. కొంతమంది ఉద్యోగులు తమ పుట్టిన తేదీ సరిగ్గా లేని వారికి జిల్లా దవాఖానల్లో వయ స్సు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడానికి అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. రిటైర్మెంట్ పొందే వారికి బెనిఫిట్స్ చెల్లింపులో ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని, టీచర్లకు రూ. లక్ష, ఆయాలకు రూ.50వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వయోపరిమితి కారణంతో హఠాత్తుగా ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదని పలు కార్మిక సంఘాల భావిస్తున్నాయి. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 5 లక్షలు, ఆయాలకు రూ. 3 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పటాన్‌చెరును అభివృద్ధి చేశాం

ఎంపీపీ సుష్మాశ్రీని సత్కరిస్తున్న నాయకులు

పటాన్‌చెరు, జూలై 2: పటాన్‌చెరును ఆదర్శ మండలముగా అభివృద్ధి చేశామని మండల అధ్యక్షురాలు సుష్మాశ్రీ అన్నారు. మంగళవారం పటాన్‌చెరులోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుష్మాశ్రీ, జడ్పీటీసీ సుప్రజని, ఎంపీటీసీలను, మాజీ సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రోత్సాహంతో అభివృద్ధితో జిల్లాలోనే ఉత్తమ మండలంగా పటాన్‌చెరు నిలిచిందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సహకరించడంతో పనులన్నీ సజావుగా చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుప్రజ, కార్పొరేటర్లు పుష్పా, సింధు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్, ఎంఈవో పీపీ రాథోడ్, దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, గొల్కొండ లక్ష్మణ్, మన్నె రాజు, అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు సుధీర్‌రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

## గుమ్మడిదలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

గుమ్మడిదల, జూలై 2: మండలాన్ని మోడల్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేసినట్లు ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం గుమ్మడిదలతోపాటు కానుకుంట, వీరారెడ్డిపల్లి, రాంరెడ్డిబావి, నాగిరెడ్డిగూడెం, నల్లవల్లి, కొత్తపల్లి, మంబాపూర్, అనంతారం, దోమడుగు, బొంతపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.2.10 కోట్ల నిధులు, బొంతపల్లి పారిశ్రామికవాడలోని హనార్ పరిశ్రమకు చెందిన రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేసిన సీసీ రోడ్లను మంగళవారం వైస్ ఎంపీపీ నక్క మంజుల, ఆయా గ్రామాల ఎంపీటీసీలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో దయాకర్‌రావు, ఎంపీటీసీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, పార్వతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా నూతన కార్యవర్గం ఎన్నిక

చంద్రశేఖర్ అధ్యక్షుడు

రమేశ్ కార్యదర్శి

సంగారెడ్డి, జూలై 2: డాక్టర్స్ డేను పురస్కరించుకొని వైద్యులను రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సభ్యులు సన్మానించారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో డాక్టర్లు రాజు గౌడ్, సత్యనారాయణ, ప్రభాకర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యక్రవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా గోపన్నగారి చంద్రశేఖర్, కార్యదర్శిగా నక్క రమేశ్, కోశాధికారిగా సీహెచ్ అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యులు లింగాగౌడ చవాన్, సత్యనారాయణ, పాండురంగం, దశరథ్, నాగిరెడ్డి, భూమయ్య, అంజయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యోగులు చందర్, వెంకట్‌గౌడ్, కమలాకర్ పాల్గొన్నారు.

## వయసుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించాలి

కాశీపూర్‌లో పిల్లల ఎదుగుదలను పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి

కంది, జూలై 2: వయస్సుకు తగ్గ బరువు, ఎదుగుదల లేని పిల్లలను గుర్తించాలని జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పోషణ్ అభియన్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాల లోపు పిల్లల బరువు, ఎత్తును కొలిచారు. మంగళవారం కంది మండలం కాశీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ మండలంలో వయస్సుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించి సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. పిల్లలకు పోషకాహారం అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ అధికారి సౌమ్య, సూపరింటెండెంట్ విశ్వనిత, అంగన్‌వాడీ టీచర్లు శారద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, జూలై 2: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు కట్టపై గల సాయిబాబా ఆలయంలో 21 రోజుల సాయిబాబా మాల దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలరాజు, తుమ్మల రుష్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం చేపట్టాలి

సదాశివపేట, జూలై 2: మండల పరిధిలోని ఆత్మకూర్, ఏటిగడ్డసంఘం, మాలపాడు వరకు ధ్వంసమైన రోడ్డు నిర్మాణ